ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -101
బుధవారం 29 జులై 2026

# ప్రతి పంటకు బీమా..

## ఎల్ నినో ఉపద్రవాన్ని అధిగమించడం ఓ సవాల్: సీఎం చంద్రబాబు



**ఎల్ నినో ఉపద్రవాన్ని సవాల్‌గా స్వీకరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు పిలుపు**
**ప్రతి పంటకు బీమా నమోదు బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి**
**తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ఏడాదికి సరిపడా ప్రణాళికలు ఉండాలని ఆదేశం**
**పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సూచన**
**ఎల్ నినోపై అవగాహనకు మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని నిర్దేశం**



**అమరావతి జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందన్న అంచనాల నేపథ్యంలో, ఈ ఉపద్రవాన్ని అధిగమించడం అధికార యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కష్టకాలంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని, వారికి సరైన సమాచారం అందిస్తూ నష్టపోకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. **మిగతా 2లో...**

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట



**యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్**
**లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా**
**గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు**
**లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**



**న్యూఢిల్లీ,జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా**మిగతా 2లో...**

# జనసంద్రమైన సింహాచలం.

**ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం**
**అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం**
**10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా**
**భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ**
**స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ**

**సింహాచలం జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో **మిగతా 2లో...**



## విజయవాడ, గుంటూరుతో
# కలిపి చూడాలి

**రాజధాని పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష**
**స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా పనిచేయాలని సూచన**
**పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం**
**ఆర్థిక సమస్యలు ఉండవని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**
**ఇకపై క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని వెల్లడి**




**అమరావతి జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** రాజధాని అమరావతిని కేవలం 29 గ్రామాల సముదాయంగా మాత్రమే చూడరాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకొని ఒక బృహత్ ప్రణాళికగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రెండు **మిగతా 2లో...**

# రేపిస్ట్‌లను సమర్ధించే వ్యక్తికి విద్యాశాఖ

**ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ**



2లో.

## హైడ్రా కార్యక్రమాలను
# కొనసాగిస్తాం

**ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది**
**కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం -హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు**
**కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు -ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీజూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. **మిగతా 2లో...**



# డీఎస్సీ అవకతవకలకు ఆస్కారమే లేదు..




**అత్యాధునిక భద్రతపై ఏపీ ప్రభుత్వం వివరణ**
**ఏపీ మెగా డీస్సీ-2025పై ఆరోపణలు**
**వివరణ ఇచ్చిన కూటమి ప్రభుత్వం**
**మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు గాను 15,941 మందికి నియామక పత్రాలు జారీ**
**టీసీఎస్ ప్లాట్‌ఫామ్‌పై పటిష్ఠ భద్రతతో కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ**
**ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం, పారదర్శకతకు పెద్దపీట**

2లో.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

## : రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

**హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు**
**హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్**
**హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ**
**కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న**

**జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు. **మిగతా 2లో...**



# తెలుగు తేజం సిల్వర్ షో

**వెయిట్‌లిఫ్టింగ్‌లో అజయ బాబుకు రజతం**
**గ్లాస్గో 2026 కామన్‌వెల్త్ క్రీడలు**

**గ్లాస్గో (స్కాట్లాండ్)జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):** గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో తెలుగు వెలుగు. తెలుగు తేజం, విజయనగరం జిల్లాకు చెందిన వల్లూరి అజయ బాబు వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం సాధించాడు. సోమవారం అర్థరాత్రి దాటాక జరిగిన పురుషుల 79 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో వల్లూరి అజయ బాబు పతక ప్రదర్శన కనబరిచాడు. స్నాచ్‌లో 149 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కేజీలు ఎత్తిన అజయ బాబు.. ఓవరాల్‌గా 330 కేజీలు **2లో...**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం‘ అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రతి పంటకు బీమా..

**మొదటిపేజీ తరువాయి**

ఎల్ నినో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ చర్యలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**ఎల్ నినో ఉపద్రవం..**

ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “ఎల్ నినో ఉపద్రవాన్ని అధికార యంత్రాంగం మొత్తం ఒక సవాల్‌గా స్వీకరించి సమష్టిగా పనిచేయాలి. మంత్రి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. వరదలు, తుపానుల సమయంలో ఎలాగైతే అప్రమత్తంగా ఉంటామో, అదే రీతిలో ఇప్పుడు కూడా పనిచేయాలి“ అని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీలు, నీటి సంఘాల సభ్యులను ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు, పంటల అధ్యయనం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల (ఆర్ఎస్కే) స్థాయిలో ఇంప్లిమెంటేషన్ కమిటీలు ఏర్పాటు చేసి, సిబ్బందిని కన్వీనర్లుగా నియమించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో డెయిరీ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం లభిస్తుందని సీఎం సూచించారు.

**ప్రతి పంటకు బీమా.. కలెక్టర్లదే బాధ్యత**

రైతులను ఆదుకునేందుకు పంటల బీమా కీలకమని చంద్రబాబు అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద నమోదు ప్రక్రియ జూలై 31తో ముగియనుండగా, వరికి ఆగస్టు 15 వరకు గడువు ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 6.30 లక్షల హెక్టార్లలో పంటలు బీమా పరిధిలోకి వచ్చాయని వివరించారు.

దీనిపై సీఎం స్పందిస్తూ.. “రాష్ట్రంలో సాగైన ప్రతి పంటకు కచ్చితంగా బీమా చేయించాలి. ఒక్క పంట నమోదు కాకపోయినా దానికి సంబంధిత జిల్లా కలెక్టర్లే పూర్తి బాధ్యత వహించాలి“ అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు.

**పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్**

ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. “ఈ కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చే డేటాను నిరంతరం విశ్లేషించాలి. ఆ విశ్లేషణల ఆధారంగా రైతులకు అవసరమైన సూచనలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలి. ఏ ల్యాండ్ పార్శిల్‌లో పంటకు ఇబ్బంది ఉంది, అక్కడ బోరుబావి అందుబాటులో ఉందా, భూగర్భ జలాల పరిస్థితి ఏంటి అనే వివరాలతో రైతులకు సరైన మార్గనిర్దేశం చేయాలి“ అని సీఎం అన్నారు. దీనివల్ల రైతులు అనవసరంగా పెట్టుబడి పెట్టి నష్టపోకుండా ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు.

**క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన.. ప్రత్యామ్నాయ పంటలు**

ఆగస్టు 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినోపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన కంది, ఆముదం, మినుము వంటి వాటిపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఎల్ నినో కారణంగా నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మొబైల్ వాహనాలను రైతులు లేదా డ్వాక్రా మహిళలకు అప్పగించాలని సీఎం తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**మొదటిపేజీ తరువాయి**

పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# డీఎస్సీ అవకతవకలకు ఆస్కారమే లేదు..

**అమరావతి జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):**

మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక పరీక్షల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను ఏపీలోని కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీ చర్యలతో పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేసింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**లీక్‌కు ఆస్కారం లేని భద్రతా వ్యవస్థ**

పరీక్షల నిర్వహణలో అనుసరించిన పటిష్ఠమైన భద్రతా విధానాలను ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన టీసీఎస్ అయాన్ (ఐజూ ఖూచీ) ప్లాట్‌ఫామ్‌ను ఈ పరీక్షల కోసం వినియోగించినట్టు తెలిపింది. సమాచార భద్రతకు అత్యున్నత ప్రామాణికమైన 256-బిట్ ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీతో ప్రశ్నపత్రాలను భద్రపరిచామని, దీనివల్ల డేటా లీక్ అయ్యే అవకాశమే లేదని స్పష్టం చేసింది. పరీక్ష రాసే ప్రతి అభ్యర్థికి 42 లక్షల ప్రశ్నల భారీ బ్యాంక్ నుంచి కంప్యూటర్ ద్వారా యాదృచ్ఛికంగా (=ఖఅంశీఎ ాష్ట్రబటటశ్రీఱఅస్త్ర) ప్రశ్నలు వస్తాయని, ఒక అభ్యర్థికి వచ్చిన ప్రశ్నపత్రం మరొకరికి రాదని వివరించింది. దీనివల్ల మాస్ కాపీయింగ్‌కు గానీ, ముందుగా ప్రశ్నలు తెలుసుకునేందుకు గానీ ఆస్కారం ఉండదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ప్రతి పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ నిఘా వంటి బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహించామని పేర్కొంది. దరఖాస్తు స్వీకరణ నుంచి హాల్ టికెట్ల జారీ, ఆన్‌లైన్ పరీక్ష, ఫలితాల వెల్లడి, తుది ఎంపిక వరకు ప్రతి దశలోనూ పారదర్శకతకు పెద్దపీట వేశామని ప్రభుత్వం వివరించింది.

**గత ప్రభుత్వ విధానాలపై విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ నియామకాలపై అనుసరించిన వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం తప్పుబట్టింది. గత పాలకులు ‘మెగా డీఎస్సీ‘ అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, చివరికి ‘టెట్ కమ్ టీఆర్టీ‘ పేరుతో నియామకాలు చేపట్టి అభ్యర్థులను గందరగోళానికి గురిచేశారని ఆరోపించింది. 2024 ఎన్నికల ముందు కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారని విమర్శించింది. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్యను 16,347కు పెంచి, నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందని గుర్తుచేసింది. గతంలో జరిగినట్లుగా అసంబద్ధ విధానాలకు, అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకునే చర్యలకు తమ పాలనలో తావులేదని స్పష్టం చేసింది.

**అభ్యర్థులకు అండగా ఉంటాం**

ఏళ్ల తరబడి కష్టపడి చదివి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థుల శ్రమ వృథా కాదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రతిభ, నిబద్ధత, కఠోర శ్రమను నమ్ముకున్న వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని పేర్కొంది. కొందరు కావాలనే అవాస్తవ ప్రచారాలతో అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది.

ఈ నియామక ప్రక్రియలో ఏ ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగదని, కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి రాజీకి తావులేదని, ఈ విషయంలో తమ ప్రభుత్వ నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన పనిలేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

# జనసంద్రమైన సింహాచలం.

**మొదటిపేజీ తరువాయి**

32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది.

కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

# విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి

**మొదటిపేజీ తరువాయి**

నగరాల్లోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులను రాజధానికి అనుసంధానంగా అభివృద్ధి చేసినప్పుడే సమగ్ర రాజధాని రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో రాజధాని నిర్మాణ పనులపై సీఆర్డీఏ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణ పనులను ‘స్పీడ్, క్వాలిటీ, డెలివరీ‘ లక్ష్యంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత పెరిగినప్పటికీ, అది ఏమాత్రం సరిపోదని, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామని, కాబట్టి పనుల్లో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణం వంటి గొప్ప అవకాశం దక్కినందుకు కాంట్రాక్టు సంస్థలు దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజధానిలో రూ.50,999 కోట్ల విలువైన 95 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, నెలకు కనీసం 7.92 శాతం చొప్పున పనులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్ల వంటి కీలకమైన అంశాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు, ఉన్నతాధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

రాజధాని నిర్మాణ పనుల పురోగతిని ఇకపై తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేపిస్ట్‌లను సమర్థించే వ్యక్తికి విద్యాశాఖ

## ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జూలై28:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రహ్లాద్ జోషి అత్యంత నీచమైన ప్రవర్తన కలిగిన వ్యక్తి అంటూ రాహుల్ మండిపడ్డారు. రేపిస్ట్‌లను ఆయన రక్షిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ బయట రాహుల్ గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. ’యువత విద్యావ్యవస్థపై నిరసనలు తెలుపుతోంది. చాలా మంది అమ్మాయిలు ఆందోళనలు చేస్తున్నారు. పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారు. అంతటితో ఆగకుండా.. రేపిస్ట్‌లను సమర్థించే ఓ వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిని చేసింది. ఆయన అత్యంత నీచమైన వ్యక్తి. రేపిస్ట్‌లకు రక్షణ కావాలని చెప్పే వ్యక్తి కంటే మించిన నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అలాంటి వ్యక్తి భారతదేశ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు’ అని వ్యాఖ్యానించారు. బిల్కిస్ బానో గ్యాంగ్‌రేప్ కేసులో దోషుల శిక్షా కాలాన్ని తగ్గించి, విడుదల చేయడాన్ని గతంలో ప్రహ్లాద్ జోషి సమర్థిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాహుల్ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద ‘ఆర్ఆర్ ట్యాక్స్‘ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# తెలుగు తేజం సిల్వర్ షో

**మొదటిపేజీ తరువాయి**

ఎత్తిపడేశాడు. 331 కేజీలతో మలేషియా వెయిట్‌లిఫ్టర్ మహ్మద్ హిదయత్ పసిడి పతకం సాధించాడు. స్నాచ్‌లో 149 కేజీలతో అజయ బాబు ముందంజలో నిలువగా.. 147 కేజీలతో హిదయత్ తర్వాతి స్థానంలో ఉన్నాడు. కానీ క్లీన్ అండ్ జెర్క్‌లో హిదయత్ 184 కేజీలు అవలీలగా ఎత్తాడు. దీంతో స్నాచ్‌లో లోటును అధిగమించి అజయ బాబును వెనక్కి నెట్టాడు. ఇంగ్లాండ్ వెయిట్‌లిఫ్టర్ క్రిస్ ముర్రే 325 కేజీలతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఇక పురుషుల హై జంప్‌లో సర్వేశ్ అనిల్ కుశారె సైతం రజత పతకం సాధించాడు. ఫైనల్లో 2.25 మీటర్ల జంప్‌తో సర్వేశ్ రెండో స్థానంలో నిలిచాడు. జమైకా అథ్లెట్ 2.25 మీటర్లతో పసిడి పతకం సాధించాడు. సర్వేశ్, జమైకా అథ్లెట్ సమవుజ్జీలుగా నిలిచినా.. తక్కువ ఫెయిల్యూర్స్ (కౌంట్‌బ్యాక్ రూల్) ప్రాతిపదికన జమైకా అథ్లెట్‌కు పసిడి పతకం అందించారు.

**షర్మిళకు స్వర్ణం**

గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో పారా అథ్లెట్ షర్మిళ చరిత్ర సృష్టించింది. సీజన్ బెస్ట్ ప్రదర్శనతో షర్మిళ పసిడి పతకం నెగ్గింది. మహిళల షాట్‌పుట్ (ఎఫ్57) ఫైనల్లో షర్మిళ అగ్రస్థానంలో నిలిచింది. 9.81 మీటర్ల దూరంతో పసిడి పతకం సొంతం చేసుకుంది. బంగారు పతకం సాధించిన షర్మిళ.. కామన్‌వెల్త్ క్రీడల్లో పారా పసిడి నెగ్గిన తొలి ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడిన శిల్పా కంచుగారకొప్పలు శ్యాల కాంస్య పతకం దక్కించుకుంది. 7.26 మీటర్ల దూరంతో ఉత్తమ వ్యక్తిగత ప్రదర్శన చేసిన శిల్పా మూడో స్థానంలో నిలిచి మెడల్ సాధించింది. ఓ పారా అథ్లెటిక్స్ ఈవెంట్‌లో భారత పారా అథ్లెట్లు రెండు పతకాలు సాధించటం ఇదే ప్రథమం.

**2010లో తండ్రి..2026లో తనయుడు**

2004లో జన్మించిన అజయ బాబుది క్రీడా నేపథ్యం కలిగిన కుటుంబం. అజయ్ బాబు తండ్రి వల్లూరి శ్రీనివాస రావు సైతం వెయిట్‌లిఫ్టర్. అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. 2003 ఆఫ్రో ఏసియన్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్‌తో మొదలైన శ్రీనివాస రావు పతక ప్రస్థానం.. కామన్‌వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం అందుకునే వరకు సాగింది. 2010 ఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడలకు ఓ నెల రోజుల ముంగిట శ్రీనివాస రావుకు గాయమైనా.. మెన్స్ 56 కేజీల విభాగంలో పోటీపడి కాంస్య పతకం సాధించాడు. అంతకుముందు, 2009లో కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఇదే విభాగంలో పసిడి పతకం దక్కించుకున్నాడు. 2011 నేషనల్ గేమ్స్‌లో చాంపియన్‌గా నిలిచిన శ్రీనివాస రావు.. 2010 ఆసియా క్రీడల్లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. శ్రీనివాస రావు ఇద్దరు కుమారులు వెయిట్‌లిఫ్టర్లు కాగా.. అజయ బాబు గ్లాస్గోలో తండ్రిని మించిన ప్రదర్శన కనబరిచాడు.

# ఆళ్లగడ్డలో అమరావతి ఛాంపియన్ పోటీలు

## ప్రారంభించిన - ఎం ఈ ఓ శోభ వివేకావతి.

**ఆళ్లగడ్డ జులై 28 రిపబ్లిక్ న్యూస్**

అమరావతి ఛాంపియన్షిప్ పోటీలలో భాగంగా ఈ చాంపియన్షిప్ పోటీలకు ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ వి.ఎం. రాజు, ఆళ్లగడ్డ ఎం,ఈ,ఓ శోభ వివేకావతి ఆళ్లగడ్డ గవర్నమెంట్ హై స్కూల్ హెడ్మాస్టర్ వీర రాఘవయ్య పాల్గొన్నారు.కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనగావించి ఎం. ఇ. ఓ రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిం చారు.

ఈ సందర్బంగా క్రీడాకారులను ఉద్దేశించి

డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ వి ఎం రాజు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు నిజకవర్గ పరిధిలో పోటీలను నిర్వహించి ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎన్నుకొని జిల్లాస్థాయి,రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే విధంగా అమరావతి చాంపియన్షిప్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది అని అన్నారు అనంతరం

ఎం,ఈ,ఓ శోభ వివేకావతి మాట్లాడుతూ ఈ అమరావతి చాంపియన్షిప్ పోటీలు నియోజక వర్గ పరిధిలో జరుగుతున్నాయని ఈ పోటీలలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎన్నిక చేసుకొని జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపించి.మన ఆళ్లగడ్డ నియోజకవర్గం క్రీడాకారులు పథకాలు సాధించాలి అని





మన ఆళ్లగడ్డ కు ,వారి తల్లిదండ్రులకు, వారి పాఠశాలకు,మంచి పేరు తీసుకురావాలని ఏం ఈ ఓ శోభ వివేకావతి క్రీడాకారులను కోరారు.

గవర్నమెంట్ హై స్కూల్ హెడ్ మాస్టర్ వీర రాఘవయ్య క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.పక్క రాష్ట్రాలలో,భారతదేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు,క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పించిందని దానిలో భాగంగానే ఉద్యోగాల రిజర్వేషన్లు 3% శాతం క్రీడాకారులకు కేటాయించడం జరిగిందని. క్రీడాకారులమైన మనము ఎంతో గర్వించదగ్గ విషయమని దీనిని క్రీడాకారులు అందరూ సద్వినియోగపరుచుకోవాలని . వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిభ ఉన్న క్రీడాకాలను ఎంపిక చేసుకొని మంచి శిక్షణను ఇచ్చి.జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా క్రీడాకారులకు. తోడ్పాటు అందించాలని క్రీడల అభివృద్ధి మన అందరి బాధ్యత అని హెడ్మాస్టర్ వీర రాఘవయ్య తెలియజేశారు.

ఈ సందర్బంగా హెడ్ మాస్టర్ వీర రాఘవయ్య, ఎం,



ఈ,ఓ శోభ వివేకావతి, డిస్టిక్ స్పోర్ట్స్ ఆఫీసర్ వి. ఎం.రాజు.క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు నిర్వహించుటకు వ్యాయామ ఉపాధ్యాయులైనటువంటి ఆశాజ్యోతి, ఎల్ ప్రతాప్, మనోహర్ బాబు ,మౌలాలి, చాంద్బాషా , భారతి, సుమ, ఓబన్న, రవి, ధర్మరాజు, దేవేంద్ర, శ్రీధర్, సువర్ణ, లోకేశ్వరి, నరసింహ, రాణి, దాదా పీర్, వినోద్ కుమార్ ఆర్.ఆర్ అకాడమీ కోచ్ డిపి సుబ్బరాయుడు మరియు కె వి కే (క్రీడా వికాస కేంద్రం ) స్టేడియం కోచ్ లు వెంకటరమణ , శాంతిరాజు, సుదర్శన్,లక్ష్మణ్, విక్రమ్, మణికంఠ , దేబోరా ఈ అమరావతి ఛాంపియన్షిప్ పోటీలను నిర్వహించారు.

# కనీస వేతనాల అమలు ఉద్యోగ భద్రత కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వ్యవస్థ రద్దు కోసం జులై 30, 31 తేదీలలో చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి- సీఐటీయూ

**ఆళ్లగడ్డ జులై 28 రిపబ్లిక్ న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్,డైలీ వేజ్, ఎన్.ఎం.ఆర్ గౌరవ వేతనం పేరుతో ఈ రాష్ట్రంలో మూడు లక్షల మంది పనిచేస్తున్నారు . వీరికి నేటికీ కనీస వేతనాలు అమలు చేయలేదు, ఉద్యోగ భద్రత లేదు వాటి సాధనకై జులై 30,31 తేదీలలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసు సురత్నం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వెంకటయ్య కోరారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి పాలకులు మారుతున్నారు కానీ కార్మికుల ఉద్యోగుల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదు. కనీస వేతనాలు పర్మినెంట్ ఎన్నికల నినాదాలుగా మారుతున్నాయి. ఇచ్చిన మాట తప్పడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. అతి తక్కువ వేతనాలతో పెరిగిన నిత్యావసరాల ధరలతో కుటుంబాల పోషణ ఎంత దుర్భరంగా ఉందో పాలకులకు పట్టడం లేదు. ఎన్నో ఆశలతో ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలో ముఖ్యమంత్రి దగ్గర కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, డైలీ వేజ్, ఎన్ ఎమ్ ఆర్ గౌరవ వేతనంతో పనిచేస్తున్న ఉద్యోగుల గురించి మాట్లాడటం లేదు. 77 రకాల షెడ్యూల్డ్ ఎంప్లాయ్మెంట్ వర్కర్ల గురించి వారి వేతనాల గురించి పాలకులకు పట్టడం లేదు. ఎన్నాళ్ళు మౌనం వహిద్దాం ప్రశ్నించకపోతే జీవితాలు మారవు కాబట్టి అందరము ఒక్కటై ప్రశ్నిద్దాం. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏమైంది.అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న గ్రామపంచాయతీ, స్వచ్ఛభారత్,కార్మికులకు పిఎఫ్ కనీస వేతనాలు ఎక్కడ,మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ ఎప్పుడు,ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికుల జీవితాల మార్పు ఎప్పుడు,108,104,102, ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. భవన నిర్మాణ కార్మికుల



సంక్షేమం గురించి పాలకులకు పట్టదా లక్షలాది మంది నిరుద్యోగుల సమస్య ఎప్పుడు తీరుస్తారు.కాళీ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారు,వివిధ పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలకు బాధ్యులెవరు ? కార్మిక శాఖ ఏం చేస్తుంది.ఎందుకు ఉన్నట్లు ఆర్టిసి మనుగడ ఏమవుతుంది ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే నడపాలి ఆర్టీసీలో పనిచేస్తున్న హైర్ బస్సు డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు కావాలి. మున్సిపల్ కార్మికులకు సుప్రీంకోర్టు,హైకోర్టు తీర్పుల ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలిపర్మినెంట్ చేయాలి .ప్రభుత్వ హాస్పిటల్స్ లో పనిచేసే శానిటేషన్ వర్కర్స్ కు కనీస వేతనాలు అమలు చేయాలి అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు జీతాలు ఎప్పుడు పెంచుతారు ఉద్యోగులకు డిఏ పిఆర్సి ఎప్పుడు ఇస్తారు. అంగన్వాడి,ఆశా, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనాలు ఎప్పుడు పెంచుతారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల సంక్షేమం పట్టదా ప్రభుత్వ రంగ సంస్థల్లో ధార్మిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఎప్పుడు అమలు చేస్తారు. పాలకుల మాటలు నీటి మూటలేనా అని వారుప్రశ్నించారు. ప్రభుత్వాలు ఉద్యోగుల, కార్మికుల, సంక్షేమం కన్నా బడా పారిశ్రామికవేత్తల, పెట్టుబడిదారుల,సంక్షేమం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంది. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోర్డులు లను తీసుకొని వచ్చి కోట్ల మంది కార్మిక వర్గాన్ని నట్టేట ముంచిన చరిత్ర ఈ పాలకులకు ఉంది. ఇచ్చిన మాట తప్పితే ఆ ప్రభుత్వం సచ్చినట్టు లెక్క పాలకులు ఏ కోవలో ఉన్నారో ఈ రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలి.రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు అసంఘటితరంగా కార్మికులు ప్రవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులు గ్రామ రెవెన్యూ సహాయకులు అంగన్వాడీ ఆశ మధ్యాహ్నం ఫీల్డ్ అసిస్టెంట్లు ధార్మిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు 77 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కార్మికులు జులై 30 31న జరిగే కలెక్టర్ కార్యాలయాల ఆందోళనను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు సిఐటియు అధ్యక్షులు ఉస్మాన్ భాష సిఐటియూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓబులేసు వెంకటేశ్వర్లు సుధాకర్ సైమన్ జానా రమేష్ శ్రీనివాసులు లచ్చుమ్మ మేస్త్రి సరోజమ్మ పుల్లమ్మ భారతి మొదలగువారు జులై 30 31 కార్యక్రమంలో పాల్గొనాలని పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది.

# హెపటైటిస్‌పై భయం వద్దు.. అవగాహనతోనే నివారణ సాధ్యం

## -పరీక్షలు, టీకాలు, పరిశుభ్రతతో హెపటైటిస్‌ను అరికట్టొచ్చు

## - కేఎంసీ అవగాహన సదస్సులో డా. చిట్టి నరసమ్మ, డా. వెంకటేశ్వర్లు







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 28)**

ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు మెడికల్ కాలేజీ ఓల్డ్ సీఎల్జీ హాలులో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మరియు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెపటైటిస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి అయినప్పటికీ, సరైన అవగాహన, సకాలంలో పరీక్షలు, టీకాలు, పరిశుభ్రత ద్వారా పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెపటైటిస్-బి టీకా వేయించుకోవడంతో పాటు కలుషిత ఆహారం, నీటికి దూరంగా ఉండాలని సూచించారు. సురక్షిత రక్త మార్పిడి, పరిశుభ్రమైన వైద్య పరికరాల వినియోగం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం



ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.4 మిలియన్ల మంది, భారతదేశంలో సుమారు 6 లక్షల మంది హెపటైటిస్ ప్రభావంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ హెపటైటిస్ దినోత్సవ థీమ్ ను ప్రస్తావిస్తూ, హెపటైటిస్‌పై ఉన్న అపోహలను తొలగించి ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స పొందాలని సూచించారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్య సాధనలో వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఇంటర్న్లు, వైద్య విద్యార్థులు హెపటైటిస్ రకాలు, లక్షణాలు, వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, సకాలంలో చికిత్స అవసరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా అవగాహన కల్పించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సింధియా శుభప్రద, ప్రొఫెసర్లు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ అరుణ, డాక్టర్ రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ హరి సింహా, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, వైద్యులు, పీజీ, ఎంబీబీఎస్, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమం ముగింపులో హెపటైటిస్ నిర్మూలనకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్2026 పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో పాల్గొన్న అనంత డిగ్రీ కళాశాల, విద్యార్థినులు

## విశిష్ట ప్రతిభ కనబరచిన అనంత డిగ్రీ కళాశాల విద్యార్థినిలు.

**ఆళ్లగడ్డ జులై. 28 రిపబ్లిక్ న్యూస్**




వాలీబాల్ విభాగంలో అండర్-17 విభాగం నుంచి ఎం. స్వాతి, అండర్-23 విభాగం నుంచి ఎం. ఆసియా, ఎల్. రుక్సానా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అనంత విద్యా సంస్థల అధినేత రామసుబ్బారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి, అనంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, అనంత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరాచారి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులను అభినందించి, భవిష్యత్తులో కూడా క్రీడల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం తమ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని, క్రీడలకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

# అమీర్‌మియ్యా శిథిల భవనం త్వరలో కూల్చివేత

## ప్రజా భద్రత దృష్ట్యా చర్యలు ఖర్చు యజమాని నుంచే వసూలు చేస్తాం: కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 28)**



నగరంలోని చిదంబరావు వీధిలో శిథిలావస్థకు చేరిన అమీర్‌మియ్యా భవనాన్ని త్వరలో కూల్చివేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆయన సంబంధిత అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, దశాబ్దాల క్రితం నిర్మించిన అమీర్‌మియ్యా భవనం ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరిందని, పరిసర ప్రాంతాల ప్రజల భద్రతకు ముప్పుగా మారిందన్నారు. భవన యజమానికి పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోనే కూల్చివేత చేపట్టనున్నట్లు వెల్లడించారు. కూల్చివేతకు అయ్యే మొత్తం ఖర్చును భవన యజమాని నుంచే రాబడతామని స్పష్టం చేశారు.నగర పరిధిలో శిథిలావస్థకు చేరిన ఇతర భవనాల యజమానులు కూడా స్వచ్ఛందంగా వాటిని తొలగించి ప్రమాదాలను నివారించాలని సూచించారు.అనంతరం కమిషనర్ రాగమయూరి ల్యాండ్‌మార్క్, అవెన్యూ ల్యాండ్‌మార్క్ వెంచర్లను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణం, డ్రైనేజీ కాలువల ఏర్పాటు, వీధి దీపాల ఏర్పాటు, మొక్కల నాటింపు, వీధి కుక్కల బెడద నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పరిమళ్‌నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి అక్కడి నిర్వహణపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రమణమూర్తి, ఎంఈ గిరిరాజ్, డీఈఈ శ్రీనివాసన్, ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖాసిం వలి, సూపరింటెండెంట్ సుబ్బన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆలీం బాష, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ పేపర్ లీక్‌పై వైఎస్సార్సీపీ నిరసన

## లోకేష్ రాజీనామా చేయాలి అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 28)**డీఎస్సీ పేపర్ లీక్, నియామకాల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కేంద్రంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు డీఎస్సీ పేపర్ లీక్ ఘటనతో పాటు నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలకు రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను వెలికితీసేందుకు సీబీఐతో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళన కార్యక్రమంలో సీనియర్ వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ మేయర్ బి.వి. రామయ్య, రాష్ట్ర యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ బుట్టా ప్రతుల్, కర్నూలు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్, విద్యార్థి విభాగం నాయకులు గౌతం, మణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలి

## - ఏఓ పవన్ కుమార్...



**బండి ఆత్మకూరు, జూలై 28, (రిపబ్లిక్ న్యూస్):-** మండలంలోని పెద్దదేవలాపురం, సంత జూటూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంటల బీమా పథకం ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. అర్హత, నమోదు విధానం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట బీమా రైతులకు అందించే ప్రయోజనాల గురించి వివరించారు. రైతుల సాగు చేసిన ప్రతి పంటకు బీమా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి తెలిపారు. అనంతరం ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేల తేమ సంరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా చేపట్టే వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంట బెట్ట గురి అయినప్పుడు 19:19:19 నీటిలో కరిగే ఎరువును 1% ద్రావణంగా ఆకులపై పిచికారీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అధికారులు మొక్కజొన్న ,పత్తి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల ఎదుగుదల, నేలలో తేమ పరిస్థితులు, చీడపీడలు, వ్యాధుల ఉనికిని పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకుని పంట పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వెటర్నరీ డాక్టర్ అనూష, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్పుత్, మహేంద్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గుడుంబై తాండ లో మామిడిలో కత్తిరింపు

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 28(రిపబ్లిక్ న్యూస్)**



ఓర్వకల్లు మండలం లోని గుడుంబై తండా లో ఈ మంగళవారం రోజున మామిడి లో కత్తిరింపులు, ఎరువుల పై రైతు శిక్షణా కార్యక్రమం ఉద్యానశాఖ ద్వారా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఉద్యాన అధికారి, రాజా కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మామిడి లో కత్తిరింపులు చేసుకోవడం ద్వారా చీడ పీడలను నివారించుకుని దిగుబడులు పెంచుకోవచ్చుని తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర మాట్లాడుతూ రైతులు ఈ సమయం లో మామిడిలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉద్యాన పరిశోధనాస్థానం, మహానంది శాస్త్రవేత్త నాయక్ మాట్లాడుతూ రైతులు మొక్కకు హానికరమైన కల్తార్ వంటి రసాయనాలు వాడటం వలన చెట్టు క్షీణిస్తుందని రైతులు నేలలో కార్బన్ శాతం పెంచుకోవడానికి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని కోరారు. ఉద్యాన అధికారి అనూష మాట్లాడుతూ రైతులు నేలలోని తేమ శాతాన్ని కాపాడుకోవడానికి నేలను ఎప్పుడూ పంటలతో కప్పి ఉంచాలని గ్రా.వీ.ణ.నా పద్ధతిని ప్రతి తోటలో వేయించాలని సూచించారు మరియు రైతులు ఈ ఎల్ నినో పరిస్థితుల్లో తమ పంటలను రక్షించుకోవడానికి ఫారం పాండ్ లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొని రైతులకు గ్రావీణా మరియు విత్తన గుళికల తయారీ విధానం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన సహాయకులు శశిదేవి, వేణుగోపాల్ మరియు తండా లోని 40 మంది రైతులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్టు

## సి ఐ మంజునాథ్



**ఎమ్మిగనూరు , జూలై 28, ప్రజారిపబ్లిక్ న్యూస్**
)మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో యువకుడు తెలుగు కార్తీక్ (18) హత్య కేసులో నిందితుడు తెలుగు లక్ష్మన్నను మంగళవారం అరెస్టు చేసినట్లు కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతి తెలిపారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు తెలుగు కార్తీక్, నిందితుడు తెలుగు లక్ష్మన్న చిన్నప్పటి నుంచి స్నేహితులు. అయితే గత రెండు నెలలుగా కార్తీక్ తనను దూరం పెడుతూ ఇతరులతో స్నేహం చేస్తున్నాడనే అనుమానంతో లక్ష్మన్న కక్ష పెంచుకున్నాడు.ఈ నెల 23న కార్తీక్ గ్రామ సమీపంలోని గౌడప్పకుంట బీడు పొలానికి ఆవును మేపేందుకు ఒంటరిగా వెళ్లిన సమయంలో నిందితుడు అక్కడికి చేరుకుని కడుపు భాగంలో రెండు సార్లు కత్తితో పొడిచి పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను తొలుత ఆదోని మధు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం గ్రామ సమీపంలోని నబీసాబ్ తాత దర్గా వద్ద నిందితుడు తెలుగు లక్ష్మన్నను అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన కొంతలపాడు గ్రామ రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి

**గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి స్థలాలను లబ్ధిదారులకు చూపించాలి**

**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్**

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 28(రిపబ్లిక్ న్యూస్)**



మంగళవారం రోజు కొంతలపాడు గ్రామంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు మద్దిలేటి ఆధ్వర్యంలో పర్యటించడం జరిగింది ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న వ్యాకస మండల కార్యదర్శి ఏ రామకృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఏపీఐఐసీలో భూములు కోల్పోయి మండల మరియు జిల్లా అధికారుల చుట్టూ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు పరిశ్రమల పేరుతో రైతులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా వారి అనుమతి లేకుండా బలవంతంగా భూములు లాక్కొని పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి చేస్తాం అంటూ పకడ్బాలు పలుకుతున్నారని విమర్శించారు దీంతోపాటు గత ప్రభుత్వంలో 96 మంది బడుగు బలహీన వర్గాల పేదలకు ఇంటి స్థలాలు పట్టా మంజూరు చేశారని కానీ ఇంతవరకు ఎవరి స్థలం ఎక్కడ ఉందో చూపలేదని ప్రజలు వాపోతున్నారని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పునరావాసం మరియు పట్టా పొందిన గ్రామ పేదలకు ఇంటి స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు దేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మాదన్న వెంకటేశ్వర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# పీపీపీ విధానానికి వ్యతిరేకంగా దస్తవేజ్ లేఖర్ల పెన్‌డౌన్ దీక్ష

## --సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ సంఘీభావం



**ఎమ్మిగనూరు, జూలై 28,( ప్రజారిపబ్లిక్ న్యూస్ )**



పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని వ్యతిరేకిస్తూ దస్తవేజ్ లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ శాంతియుత దీక్షకు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎం. సత్యన్న, కె.సి. జబ్బర్, ఎస్. బాబు, కె. ఎల్లప్ప, పీవైఎల్ నాయకుడు ఎస్. మునిప్ప మాట్లాడుతూ, ఎమ్మిగనూరు సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభమైన నాటి నుంచి దస్తవేజ్ లేఖర్లు ప్రజలకు సేవలు అందిస్తూ తమ కుటుంబాలను పోషించుకోవడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్నారని అన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 396 ద్వారా దస్తవేజ్ లేఖర్లు, స్టాంప్ వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆర్ఎస్‌కే కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే జీవో నెం. 396ను, అలాగే పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# దగా డీఎస్సీపై 'అనంత' పోరుబాట

**యువజన, విద్యార్థి విభాగంలో కదంతొక్కిన వైసీపీ శ్రేణులు**

**డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్**

**ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వానికి అల్టిమేటం**



**అనంతపురం సంక్షేమం, జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో దగాపడ్డ డీఎస్సీ అభ్యర్థులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టింది. సోమవారం అనంతపురంలో వైఎస్ఆర్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదురుగా ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహం వద్ద నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి మానహారం చేపట్టారు. ర్యాలీలో వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వైసీపీ, అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు పాల్గొని కదం తొక్కారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినదించారు. నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులు, యువత గళం విప్పాయి.

**లోకేష్ రాజీనామా చేయకపోతే యువత సత్తా చూపిస్తాం**

ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి, యువజనుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలం అయ్యాయని మండిపడ్డారు. నీట్ పరీక్ష లీకేజీపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారన్నారు. ఈ రాష్ట్రంలో డీఎస్సీ నియమకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవినీతి జరిగిందని విమర్శించారు. పరీక్షలు నిర్వహించే విభాగంలోని ఉద్యోగులే డీఎస్సీలో ఎంపికయ్యారన్నారు. నారా లోకేష్ రాజీనామా చేయకపోతే యువత, విద్యార్థులు తమ సత్తా ఏంటో చూపిస్తారని తెలిపారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమని నారా లోకేష్ చెబుతున్నారని.. వైఎస్ఆర్‌సీపీ కూడా చర్చకు సిద్ధమని ప్రకటించారు.

**ఒక్కో నిరుద్యోగికి ఈ ప్రభుత్వం రూ.75 వేలు బాకీ**

రాష్ట్ర వ్యాప్తంగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9 వేల కోట్లు ఉన్నాయని.. విద్యార్థులు సర్టిఫికెట్లు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండేళ్లు గడిచినా నిరుద్యోగ భృతి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమిదని మండిపడ్డారు. నారా లోకేష్ రాజీనామా చేయకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకే నోటిఫికేషన్‌తో 1.35 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినా ఎక్కడా చిన్న ఆరోపణ కూడా రాలేదన్నారు. రోస్టర్, మెరిట్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి సంతకం చేసిన డీఎస్సీని అక్రమాల పుట్టగా మార్చేశారని విమర్శించారు. డబ్బులిస్తే చాలు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే పరిస్థితికి తెచ్చారన్నారు. కష్టపడి చదివితే ఉద్యోగం వస్తుందని యువత భావిస్తే కనీసం మెరిట్ లిస్ట్ కూడా ప్రకటించకుండా పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. డీఎస్సీలో ఎలా అవినీతి, అక్రమాలు జరిగాయో వైఎస్ జగన్ ప్రెస్‌మీట్ పెట్టి వివరించినా ఈ ప్రభుత్వం, నారా లోకేష్ సమాధానం ఇవ్వలేదన్నారు. నిజంగా అక్రమాలు జరగలేదని భావిస్తే తక్షణం సీబీఐ విచారణ చేయించేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకాన్ని రూపొందిస్తే దాన్ని తల్లికి వందనంగా మార్చి అర్హులకు కూడా ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. రెండేళ్లుగా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఒక్కో నిరుద్యోగికి ఈ ప్రభుత్వం రూ.75 వేలు బాకీ పడిందన్నారు. నారా లోకేష్ రాజీనామా చేయకపోతే యువత సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు.

**కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు**

వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని, తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.









# ఫర్టిలైజర్ షాపులపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి

**అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని - బహుజన సేన సమితి డిమాండ్**

**ఎమ్మిగనూరు, జూలై 28,( ప్రజా రిపబ్లిక్ న్యూస్**
)ఎమ్మిగనూరు పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులపై సమగ్ర తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర జిల్లా వ్యవసాయ అధికారిని కోరారు. ఈ మేరకు ఆయన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ గద్వాల్, కోసిగి, పత్తికొండ, కోడుమూరు, ఆదోని తదితర ప్రాంతాల రైతులకు ప్రధాన కొనుగోలు కేంద్రంగా మారిందన్నారు. వేలాది మంది రైతులు ఇక్కడ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అయితే కొందరు వ్యాపారులు సరైన లైసెన్సులు లేకుండానే ఫర్టిలైజర్ షాపులు నిర్వహిస్తున్నారని, రైతులకు



తప్పనిసరిగా ఇవ్వాల్సిన బిల్లులు (రసీదులు) జారీ చేయడం లేదని ఆరోపించారు. అలాగే నకిలీ లేదా నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు, పిచికారీ మందులు విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే ఎమ్మిగనూరులోని అన్ని ఫర్టిలైజర్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లుల జారీ విధానం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న షాపుల లైసెన్సులను రద్దు చేసి, సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను మోసం చేసే వారిపై ప్రభుత్వం ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రైతుల హక్కుల పరిరక్షణ కోసం బహుజన సేన సమితి ఎల్లప్పుడూ పోరాడుతుందని గడ్డం నాగేంద్ర స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మద్దెల సిద్ధరాముడు, శ్రీను, కర్నూలు రమేష్, గూడూరు మునీంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలి

## 'చలో ఢిల్లీ' పోస్టర్ల విడుదల..



**గుత్తి, జూలై 28: (రిపబ్లిక్ న్యూస్)**
దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్ డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయినా ప్రజలు ఆశించిన స్థాయిలో దేశ అభివృద్ధి జరగలేదని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారాయని, రైతులు, కార్మికులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

దేశ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కల్పించాలంటే బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలంటే ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికీ బ్యాలెట్ విధానాన్నే అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాలు భారీ ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా 'చలో ఢిల్లీ' వాల్ పోస్టర్లను విడుదల చేసి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు



తెలిపారు. ఈ కార్యక్రమంలోసిపిఐ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ , నియోజకవర్గ నాయకులు రమేష్ బాబు,మండల కార్యదర్శి రామదాస్ రామదాస్ ,పట్టణ కార్యదర్శి రాజు యాదవ్,పట్టణ సహాయ కార్యదర్శులు,నజీర్,మహమ్మద,టియం.భాష,నాగలక్ష్మి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888
బుధవారం 29 జులై 2026

# తనను పార్టీ అధిష్టానం విజయవాడకు పిలిచిందన్న వార్తల్లో నిజం లేదు

**: ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ..**

**ఆళ్లగడ్డ జులై 28 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని సిఎస్ ఐ చర్చ్ వీధి లో డోర్ టు డోర్ కార్యక్రమం లో ఎమ్ ఎల్ ఎ పాల్గొని ప్రజా సమస్య లను తెలుసుకొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ తనను తెలుగుదేశం పార్టీ అధిష్టానం విజయవాడకు పిలిచి వివరణ కోరిందంటూ వస్తున్న వార్తలను ఖండించారు. అలాంటి సమాచారం తనకు ఎవరూ ఇవ్వలేదని, పార్టీ నుంచి ఎలాంటి ఫోన్ కాల్ లేదా అధికారిక సమాచారం అందలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపట్టిన “రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం“ ఇంటింటి ప్రచార కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోందని, ప్రతి ఎమ్మెల్యే, మంత్రి క్షేత్రస్థాయిలో పాల్గొనాలని పార్టీ ఆదేశించిందని తెలిపారు. అలాంటి కీలక కార్యక్రమం మధ్యలో తనను పిలిచే పరిస్థితి లేదని అన్నారు.
బోండా ఉమకు సంబంధించిన అంశాన్ని తనతో ముడిపెట్టి ప్రచారం చేయడం సరైనది కాదన్నారు. ఆయనకు సంబంధించిన విషయాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను వైసీపీ నాయకులతో ఎక్కడా కలిసి వ్యవహరించలేదని స్పష్టం చేశారు.
అహోబిలం ఘటనను కారణంగా చూపుతూ తనను పిలిచారన్న ప్రచారం కూడా అవాస్తవమని చెప్పారు. ఆ ఘటన జరిగి చాలా రోజులు అయ్యిందని, ఆ అంశంపై పార్టీ స్పందించాల్సి ఉంటే అప్పుడే స్పందించేదని పేర్కొన్నారు.పార్టీ ఎవరినైనా వివరణ కోరితే తప్పకుండా వెళ్లి వివరణ ఇవ్వడం ప్రతి నాయకుడి బాధ్యతేనని, తనకు అలాంటి పరిస్థితి వస్తే తాను కూడా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని తెలిపారు. అయితే ప్రస్తుతం తనను వివరణ కోసం పిలిచారన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని మరోసారి స్పష్టం చేశారు.
కొన్ని మీడియా సంస్థలు ఆధారాలు లేకుండానే ఊహాగానాలతో వార్తలు ప్రసారం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. వాస్తవాలను నిర్ధారించకుండా ప్రచారం చేయడం బాధ్యతాయుతమైన జర్నలిజం కాదన్నారు.
అలాగే అహోబిలంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన మైనర్ బాలికకు సంబంధించిన ఆరోపణల వంటి ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టకుండా, రాజకీయ ప్రచారాలకే ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమని వ్యాఖ్యానించారు.
దీచివరగా, తనపై వస్తున్న ప్రచారాలన్నీ రాజకీయ దుష్ప్రచారంలో భాగమేనని, నిజంగా ఏదైనా అధికారిక సమాచారం వస్తే మీడియాకు స్వయంగా తెలియజేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు.

# ఆళ్లగడ్డ పట్టణంలో రెండో రోజు ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

**ఆళ్లగడ్డ జులై 28 రిపబ్లిక్ న్యూస్**
కూటమి ప్రభుత్వం చేపట్టిన “రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆళ్లగడ్డ పట్టణంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల్లో ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి మాత్రమే సుమారు 7 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేశామని తెలిపారు. గత వైసీపీ పాలనలో ఒక రోడ్డు వేయాలన్నా, ఒక డ్రెయినేజీ నిర్మించాలన్నా సంవత్సరాల తరబడి ప్రజలు తిరగాల్సి వచ్చేదని, కానీ ప్రస్తుతం ప్రజల సమస్యలను తామే గుర్తించి, వెంటనే సంబంధిత మంత్రులు, అధికారులతో సమన్వయం చేసి రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు...ప్రజల కోసం ఎంత అభివృద్ధి చేసినా వైసీపీ నాయకులు విమర్శలు చేయడం తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క సలహా కూడా ఇవ్వలేదని ఆమె విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అయితే వాటిని పట్టించుకోకుండా ప్రజా సేవనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.....
ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థల పెట్టుబడులు, రాయలసీమలో కొత్త పరిశ్రమల ఏర్పాటు రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.డీఎస్సీ అంశంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, వాస్తవాలు లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం యువతను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ఆరోపణలకే వారు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆళ్లగడ్డలో జరిగిన అభివృద్ధి పనులను ప్రత్యేక కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికీ చేరవేస్తున్నామని తెలిపారు. ప్రచారంలో ప్రజలు చెప్పిన సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలందరూ 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా తీసుకుని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచి రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమిని విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సూచించారు.





# మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు సిద్ధమా

**వైసిపి నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సవాల్**
**వైసిపి నిరసనలపై తీవ్ర ఆగ్రహం**
**ఒక్క టీచర్ పోస్ట్ అయినా భర్తీ చేశారా**
**ఆరోపణలు నిరూపిస్తారో**
**కేసులు ఎదుర్కొంటారో తేల్చుకోవాలి**
**అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం సంక్షేమం, జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):**
మెగా డీఎస్సీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సవాల్ విసిరారు. అనంతపురంలో మంగళవారం రోజు మెగా డీఎస్సీ పై వైసీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాల మీద ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజల స్పందనను చూసి వైసిపి నాయకులు ఓర్వలేక**
తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేవలం 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ పూర్తి చేశారని.. 16347 పోస్టులు భర్తీ చేశారని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేసి రికార్డు టైంలో దీనిని పూర్తి చేశామన్నారు. అయితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేని వైసిపి ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తాము ఇంటింటికి వెళ్లి వివరిస్తుంటే ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ప్రజల స్పందనను చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే విమర్శలు చేశారు. మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు సిద్ధమని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని.. అయితే ఇప్పటివరకు వైసీపీ నాయకులు చర్చకు రాకుండా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు చేతనైతే ఆరోపణలు నిరూపించాలని లేకపోతే కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**గ్రూప్ 2 పోస్టులలో 150 మంది నేటికీ ఇబ్బందులు**
ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఇప్పటివరకు నాలుగు మెగా డీఎస్సీలు నిర్వహించారని ఒక్కచోట కూడా అవినీతి ఆరోపణ లేకుండా పూర్తి చేశారన్నారు. అదే బాటలోని మంత్రి నారా లోకేష్ కూడా అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించారని దగ్గుపాటి అన్నారు. డీఎస్సీ ని ఆపటానికి 238 కేసులు వైసిపి నాయకులు వేసినప్పటికీ వాటిని సమర్థవంతంగా మంత్రి నారా లోకేష్ ఎదుర్కొన్నారన్నారు. పేపర్ లీకేజీ అయిందని స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఇలా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిలో ఏ ఒక్క దానికి కూడా వైసిపి నాయకుల వద్ద ఆధారాలు లేవన్నారు. అలాంటి ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని దగ్గుబాటి సూచించారు. వైసిపి హయాంలో గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేస్తే అందులో 150 మంది నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

**గొడ్డలి పార్టీ నాయకులు నిత్యం ఏదో ఒక వివాదం**
వైయస్ హయాంలో డీఎస్సీ నిర్వహిస్తే ఆరోజు కాంగ్రెస్ నేతల పిల్లలకి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వైసిపి హయాంలో జరిగిన సచివాలయ ఉద్యోగాల నియామకాల్లో కూడా అనేక అక్రమాలు జరిగాయన్నారు. కనీసం ఐదేళ్లలో ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని... ప్రైవేట్ కంపెనీలు రాలేదు ఉద్యోగాలు ఉద్యోగాలు రాలేదని అన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషితో 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రత్యేకించి విద్యాశాఖలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద, టాయిలెట్ల వద్ద నిలబెట్టి అవమానించారన్నారు. ఈరోజు అదే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పించిన నాయకుడు మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థులు చేరుతున్నారన్నారు. ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే 4,000 మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ఫ్యాక్షన్ నేపథ్యంతో వచ్చిన గొడ్డలి పార్టీ నాయకులు నిత్యం ఏదో ఒక వివాదం సృష్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తన సొంత బాబాయిని హత్య చేసిన వారి మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. గత ఎన్నికల్లో వారిని 11 స్థానాలకు పరిమితం చేశారని వచ్చే ఎన్నికల్లో అవి కూడా రావన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని.. లేకపోతే కేసులు ఎదుర్కోక తప్పదని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరించారు.

# కేజీబీవీ ను సందర్శించిన కమిషన్ సభ్యుడు

**పోషకాహారం, వసతులపై పరిశీలన**
**నాణ్యమైన విద్యే లక్ష్యంగా ఆదేశాలు**





**శ్రీ సత్య సాయి /గుడిబండ, జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):**
శ్రీ సత్యసాయి జిల్లా గుడిబండ మండలం కరికేర కేజీబీవీ పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డా. డి. శ్రీనివాసమూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల విద్యాభ్యాసం, వసతి, పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, భద్రత తదితర అంశాలను పరిశీలించారు.గత విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ పరీక్షల ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆదేశించారు.

**పాఠశాల నిర్వహణలో నాణ్యత పెంచేందుకు చర్యలు**
ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ నాణ్యమైన బోధన అందించాలని సూచించారు.విద్యా ప్రమాణాల పెంపుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, భద్రత, పాఠశాల నిర్వహణలో నాణ్యత పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, రవిశంకర్, డా. కృష్ణమూర్తి, శ్రీనివాసులు, నాగరాజు, రమేష్, నారాయణప్ప, భోజరాజు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి: సిఐ రామారావు**



**గుత్తి, జూలై 28: (రిపబ్లిక్ న్యూస్)**గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై గుత్తి పోలీసులు ఉక్కుపాదం మోపారు. గుత్తి మండలం కొత్త ఉబిచర్ల గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో గంజాయితో సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 1130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గుత్తి పోలీస్‌స్టేషన్ సీఐ రామారావు, ఎస్సై సురేష్ తెలిపారు.సీఐ రామారావు మాట్లాడుతూ గంజాయి మనిషి ఆరోగ్యాన్ని, కుటుంబ వ్యవస్థను, యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదకర మత్తు పదార్థమని అన్నారు. గంజాయి విక్రయించడం, కొనుగోలు చేయడం, సేవించడం, నిల్వ ఉంచడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని యువతకు సూచించారు.ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ గంజాయి విక్రయించినా, సేవించినా, సాగు చేసినా లేదా అక్రమ రవాణాకు పాల్పడినా చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై సురేష్ పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

# మన్వత్ ని ఆశీర్వదించిన సాయివికాస్ రెడ్డి.



**రైల్వే కోడూరు జూలై 28 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు మండలం అబ్బినాయుడుపల్లి గ్రామానికి చెందిన మద్దిన విజయకుమార్, లావణ్య దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమారుడు మన్వత్ తొలి పుట్టినరోజు వేడుక సందర్భంగా కూడా చైర్మన్, రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డి తనయుడు, రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ యువ నేత ముక్కా సాయి వికాస్ రెడ్డి పాల్గొని చిరంజీవి మన్వత్ కి మొదటి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని చిన్నారి మన్వత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# సామాజిక అభివృద్ధికి విద్యే ప్రధాన సాధనం

**డీవీఎంసీ సభ్యుడు సోదినపల్లి రామాంజనేయులు -సివిల్ రైట్స్ డేలో అవగాహన సదస్సు**



**శ్రీ సత్యసాయి/ఒడిసి,**
**జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):**
విద్యే సామాజిక అభివృద్ధికి ప్రధాన సాధనమనిడీవీఎంసీ సభ్యుడు సోదినపల్లి రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒడిసి మండలం కొండకుమార్ల గ్రామంలో సోమవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి, రాజ్యాంగబద్ధ హక్కులు, సామాజిక సమానత్వంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీవీఎంసీ సభ్యుడు సోదినపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ కమ్యూనిటీ అభివృద్ధికి విద్యే ప్రధాన సాధనమని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యాభ్యాసం వైపు ప్రోత్సహించడంతో పాటు క్రమశిక్షణ, విలువలతో తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాల్లో అంటరానితనం, వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వ భావనతో జీవించాలని పిలుపునిచ్చారు.ఎస్సీ, ఎస్టీల హక్కులను పరిరక్షించే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం బాధితుల రక్షణ కోసం శక్తివంతమైన చట్టమని వివరించారు.
నిజంగా అన్యాయం, అవమానం, వివక్ష ఎదురైన సందర్భాల్లో మాత్రమే చట్టాన్ని వినియోగించుకోవాలని, దానిని దుర్వినియోగం చేసే పరిస్థితులకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు.గ్రామంలోని బరియల్ గ్రౌండ్ అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, మురుగు కాలువల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, ఎస్సీ రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు వంటి సమస్యలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని సామాజిక, ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఆర్ఐ, వీఆర్వో, ఎంపీడీవో, పోలీసు అధికారులు, వీఆర్ఏలు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# 12 లక్షల వైద్యానికి ఆర్థిక స్థోమత లేదు..

**భర్తను కాపాడాలని భార్య మారెమ్మ ఆవేదన**
**మంత్రి నారా లోకేష్ స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకోవాలని విజ్ఞప్తి**



**ఎమ్మిగనూరు , జూలై 28,( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన జె. విజయ్ కుమార్ (35) గత తొమ్మిది నెలలుగా తీవ్రమైన వాస్క్యులర్ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. పొట్ట భాగంలోని ప్రధాన రక్తనాళాలు పూర్తిగా మూసుకుపోవడంతో ఊపిరితిత్తులు, మెదడు సహా ఇతర అవయవాలకు రక్తప్రసరణ సరిగా జరగడం లేదని వైద్యులు నిర్ధారించారు.ఆహారం తీసుకున్న ప్రతిసారీ తీవ్రమైన కడుపు నొప్పి, చేతులు, కాళ్లు వాపు రావడంతో ప్రస్తుతం గంజి మాత్రమే తీసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అనంతరం తమిళనాడులోని వెల్లూరు ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించారు. అక్కడ వెంటనే వాస్క్యులర్ సర్జరీ చేయాల్సి ఉంటుందని, అందుకు సుమారు రూ.12 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు.విజయ్ కుమార్ కుటుంబం కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. భర్త ప్రాణాలు కాపాడాలనే ఆశతో భార్య మారెమ్మ ఇప్పటికే బంధువులు, దాయాదుల వద్ద నుంచి రూ.6 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం మరింత వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు వారు పేర్కొన్నారు.విజయ్ కుమార్‌కు భార్య మారెమ్మతో పాటు ఇద్దరు చిన్నారులు రాజు, శైలు ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆదోని పర్యటనకు రానున్న మంత్రి నారా లోకేష్ స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి లేదా ప్రభుత్వ పరంగా అవసరమైన ఆర్థిక సహాయం అందించి తన భర్తకు వైద్యం చేయించి ప్రాణాలు కాపాడాలని భార్య మారెమ్మ కన్నీటి పర్యంతమై విజ్ఞప్తి చేశారు.

# మా ప్లాట్ కబ్జా ..

## తమను బెదిరిస్తున్నారని మహిళ ఆవేదన

**-- ఉన్నతాధికారుల స్పందించి మాకు న్యాయం చేయండి**




**మంత్రాలయం, జులై, 28,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):**మంత్రాలయం మండల కేంద్రంలోని రాఘవేంద్ర నగర్లో సర్వే నంబర్ 111/1లో ఉన్న 7:75సెంట్లు స్థలం తమ కుటుంబానికి చట్టబద్ధంగా చెందినదని శారద విలేకరుల సమావేశంలో తెలిపారు.ఆమె తెలిపిన వివరాల డాక్యుమెంట్ నెంబర్ 5252/2008,సర్వే నెంబర్ 111/133,33 చదరపు గజాలు ప్రకారం, తన అత్తలు మల్లమ్మ, నీలమ్మ, హనుమంతమ్మ పేర్లపై ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. అయితే ఇటీవల మంత్రాలయానికి చెందిన వైసీపీ కార్యకర్త మద్రి మారెప్ప అనే వ్యక్తి ఈ స్థలం తమదేనని చెబుతూ, "మా స్థలంలో మీరెలా బండలు పాతుతున్నారు" అంటూ తమను ప్రశ్నిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.అంతేకాకుండా, 2026 ఏప్రిల్ 27న నకిలీ పట్టా సృష్టించుకుని తమపై ఒత్తిడి తెస్తున్నాడని, రాత్రి 7గంటల సమయంలో ఏడుగురిని ఇంటికి తీసుకువచ్చి తమ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని శారద ఆవేదన వ్యక్తం చేశారు.ఈ భూ వివాదానికి సంబంధించి గతంలో కూడా మారెప్పపై మంత్రాలయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ స్థలానికి పూర్తి రక్షణ కల్పించి, నకిలీ పత్రాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు.

## ఎల్నినోలో నిమ్మ తోటల నిర్వహణపై రైతులకు శిక్షణ

**వాతావరణ ఆధారిత పంటల బీమాపై అవగాహన**

**శాస్త్రీయ సాగుతో నష్టాలను అధిగమించొచ్చు: నిపుణులు**

**గుత్తి, జూలై 28:( రిపబ్లిక్ న్యూస్)**



ఎల్నినో ప్రభావంతో ఏర్పడుతున్న వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని నిమ్మ తోటలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహిస్తే దిగుబడులను కాపాడుకోవడంతో పాటు వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని ఉద్యాన పరిశోధన నిపుణులు పేర్కొన్నారు. హ్యూమన్ అండ్ నేచురల్ రిసోర్సెస్ డెవలప్మెంట్ సొసైటీ (హాండ్స్) గుత్తి ఆధ్వర్యంలో మంగళవారం హాండ్స్ కార్యాలయంలో "ఎల్నినో పరిస్థితుల్లో నిమ్మ తోటల నిర్వహణ, వ్యాధుల నివారణ, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్డబ్ల్యూబీసీఐఎస్ఖరీఫ్2026)" అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గుత్తి పరిసర ప్రాంతాల ఎనిమిది మండలాలకు చెందిన 95 మంది రైతులు హాజరయ్యారు. ఎల్నినో ప్రభావం వల్ల నిమ్మ సాగులో ఎదురయ్యే సవాళ్లు, దిగుబడులపై పడే ప్రభావం, పోషక యాజమాన్యం, నీటి నిర్వహణ, తోటల పునరుద్ధరణ, ఆధునిక సాగు పద్ధతులపై నిపుణులు రైతులకు సవివరంగా వివరించారు.ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నిమ్మ తోటల్లో సాధారణంగా కనిపించే వేరుకుళ్లు, ఆకుమచ్చలు, కాండం సంబంధిత వ్యాధులు, పోషక లోపాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పంట నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. జీవ ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ పద్ధతులు, తోటల ఆరోగ్య నిర్వహణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా చేపట్టాల్సిన సాగు చర్యలపై రైతులకు ప్రాయోగిక సూచనలు అందించారు.అనంతరం పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్డబ్ల్యూబీసీఐఎస్)పై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల కారణంగా కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. పథకానికి అర్హత, నమోదు విధానం, బీమా ప్రయోజనాలు, క్లెయిమ్ ప్రక్రియ, రైతులు పాటించాల్సిన నిబంధనలను వివరించి ప్రతి అర్హ రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.సదస్సులో రైతులు నిమ్మ సాగులో ఎదురవుతున్న సమస్యలను నిపుణుల దృష్టికి తీసుకెళ్లి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. శాస్త్రీయ సాగు విధానాలు, వ్యాధుల నివారణ చర్యలు, సాంకేతిక సలహాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో డా. కె.సి. భానుమూర్తి (హార్టికల్చర్ శాస్త్రవేత్త), డా. ఎం. సునీల్ కుమార్ (ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్త), డా. వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ప్రాంతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం, తిరుపతికి చెందిన బి.సి. ధనంజయ, ఉద్యాన శాఖ అనంతపురం సహాయ సంచాలకులు మారుతి నాయక్, భాస్కర్, సురేంద్రబాబు, ఇన్సూరెన్స్ మేనేజర్ ఎం. నారాయణస్వామి, హాండ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ రామకృష్ణ, జిల్లా మేనేజర్, భాగ్య (సీఏ), ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని వేయి స్తంభాల దేవాలయంలో ప్రత్యేక పూజలు

## బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు భూక్య జంపన్న గారి ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చన




**ములుగు ప్రతినిధి జూలై 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఇటీవల గుండెపోటుకు గురై సికింద్రాబాద్లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ హనుమకొండలోని చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో పూజా . ఆలయ అర్చకుల తో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పెద్ది సుదర్శన్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకుడని, ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడి మళ్లీ ప్రజల మధ్యకు వచ్చి సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ధైర్యంగా ఉండాలని, అందరి ఆశీస్సులు, ప్రార్థనలతో ఆయన త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు పెద్ది సుదర్శన్ రెడ్డి దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నాతోపాటు జన్ను రాంబాబు గారు, మోహన్ గారు, రాజేష్ గారు, నవీన్ గారు, ఉమేష్ గారు, శ్రీనివాస్ గారు, రాజుగారు, ప్రశాంత్ గారు, సంతోష్ గారు, నగేష్ గారు, సుందిలా సంతోష్ గారు, దుర్గం నగేష్ గారు, కావేరి సిద్దార్థ గారు, శ్రీమంతు గారు, రాజేష్ గారు, కొండ గొర్ల దీపక్ గారు, సును కాని రణదీర్ గారు గోగుల సంతోష్ గారు, విజయ్ రెడ్డి గారు, విజయ్ యాదవ్ గారు తదితరులు పాల్గొన్నారు.

## యు ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

**పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి.**

**సంక్షేమ హాస్టల్లో కనీస వసతులు కల్పించాలి -యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు జగన్**

**మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

మెదక్ జిల్లా మండల కేంద్రంలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ రాని పరిస్థితి నెలకొందని యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు జగన్ అన్నారు ఈ సందర్భంగా యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి జాయింట్ కలెక్టర్ గారికి 26 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు జగన్ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కూడా విద్యాశాఖ మంత్రినీ కేటాయించకపోవడంతో విద్యారంగం మొత్తం ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్నట్లుగా పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు ఆకలికి అలమటిస్తున్నారని ఆయన అన్నారు. మెదక్ జిల్లాలో సంక్షేమ హాస్టల్ల పరిస్థితి



దారుణంగా ఉందని మెను ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆయన అన్నారు కేజీబీవీ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి ప్రతి హాస్టల్లకు ఇప్పటివరకు కూడా సామాగ్రి అందడం లేదని ఆయన అన్నారు. మారుమూల గ్రామాలకు బస్సులు తిరగడం లేదని ఆయన అన్నారు. పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై డిఇఓ పట్టించుకోవడంలేదని అధిక ఫీజులను అరికట్టాలని అన్నారు. జిల్లాలో పీజీ కళాశాల ఏర్పాటు




చేయాలని అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ల ముట్టడి చేపట్టడం జరుగుతుందని మెదక్ జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా సమస్యలపై నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి భూపాల్,నాయకులు అభి, ప్రవీణ్, వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు

# విప్లవ పోరాటయోధుడి ఆశయాలు కొనసాగిద్దాం

## కమ్యూనిస్టు యోధుడికి వినమ్ర నివాళి -ఘనంగా కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 50 వ వర్ధంతి - పురవీధుల్లో ఎర్రజెండాలతో భారీ ర్యాలీ





**అనంతపురం/ గుంతకల్, జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):** విప్లవ పోరాటయోధుడి ఆశయాలు కొనసాగిద్దాం అని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగాకామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 50 వ వర్ధంతి సంస్మరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గుంతకల్ పట్టణంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుండి పొట్టి శ్రీరాములు సర్కిల్ భగత్ సింగ్ సర్కిల్ పాత గుంతకల్ మీదుగా బీరప్ప కళ్యాణ మండపం వరకు ఎర్రజెండాల ప్రదర్శనగా అరుణోదయ సంస్కృతిక కళాకారుల ఆటపాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సభకు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్ డివిజన్ కమిటీ కార్యదర్శి బి సురేష్ అధ్యక్షత వహించినారు . తరిమెల నాగిరెడ్డి చిత్రపటానికి ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ రజాక్ , సిటిజన్స్ ప్రోగ్రెసివ్ ఫోరం( సి పి ఎఫ్) జిల్లా కార్యదర్శి తారకేష్ , ఐ ఎఫ్ టి యు రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకప్ప , రాయలసీమ విద్యావంతుల వేదిక వెంకటేష్ , ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సాకే హరి తదితరులు పూల మాలలు వేసి ఘనంగా అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**ఎమ్మెల్యే పదవికి రాజీనామా ...**

**విప్లవాత్మక రైతు పోరాటాలకు నాయకత్వం**

తరిమెల నాగిరెడ్డి గారి ప్రస్థానం ప్రజాస్వామ్య సూత్రాలకు, సిద్ధాంత కట్టుబాటుకు, నిరాడంబరతకు ఒక నిదర్శనం. రాయలసీమ కరువు పరిస్థితుల నివారణకు, తుంగభద్రా, శ్రీశైలం నీటిపారుదల ప్రాజెక్టుల సాధనకు ఆయన సాగించిన పోరాటాలు రాయలసీమ రవాణా, వ్యవసాయ విప్లవానికి బలమైన పునాది వేశాయి. శాసనసభ సభ్యుడిగా ఉన్నప్పటికీ, ప్రజా ఉద్యమాల పిలుపు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి విప్లవాత్మక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు.

**సొంత ఆస్తులను కూడా ప్రజలు, పార్టీ కోసం త్యాగం**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన పీడిత ప్రజల విముక్తి కోసం సమసమాజ స్థాపన కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన గొప్ప విప్లవకారుడు ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా గెలిచి చట్టసభలలో ప్రజల వానిని గట్టిగా వినిపించినారు . పశ్చిమబెంగాలలో డార్జిలింగ్ జిల్లా నక్సల్ బరి గ్రామంలో 1967లో కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో వ్యవసాయ సాయుధ తిరుగుబాటు సంఘటన దేశంలో ఎంతోమంది విద్యార్థి యువకులకు మేధావులకు ఎంతో స్ఫూర్తినిచ్చి విప్లవ ఉద్యమంలోకి వారందరూ రావడానికి కారణం అయినది. ఆ విధంగా 1969లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఇచ్చి విప్లవ పార్టీలోకి రావడం జరిగినది . ఆయన సొంత ఆస్తులను కూడా ప్రజలకు పార్టీ కోసం త్యాగం చేసినారు ఆయన ఎమర్జెన్సీ కాలంలో రహస్యంగానే ఉంటూ 19 76లో జులై 28వ తారీఖున మరణించడం జరిగినది . అదేవిధంగా కామ్రేడ్ చారు మజుందార్ , కా" ఎస్ ఏ రవూఫ్ కా" నంబాల కేశవరావు , రాయల్ సుభాష్ చంద్రబోస్ వేలాది మంది విప్లవకారులు దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా సాయుధ ఉద్యమం ద్వారా పీడిత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించి అమరులు కావడం జరిగినది .

**కంపెనీలకు లక్షల కోట్లు విలువైన సంపదను దోచి పెట్టడం**

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తన 12 సంవత్సరాల పరిపాలనలో కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారుకు బహుళ జాతి కంపెనీలకు లక్షల కోట్లు విలువైన జాతి సంపదను దోచి పెట్టడం జరుగుతున్నది . రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వలన వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండడంతో రైతుల ఆత్మహత్య చేసుకోవడం, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు , సౌకర్యాలను నిర్వీరం చేయడం , చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులుగా కోట్లాదిమంది ఉండడం , దేశంలో హిందూ మత రాజకీయాలు చేస్తూ మత ఘర్షణలను సృష్టించడం , ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఆదాని అంబానీ కంపెనీలకు మేలు చేయడం జరుగుతున్నది , కేంద్ర ప్రభుత్వ సంస్థలను న్యాయశాఖ , సిబిఐ , ఐటి , ఆర్.బి.ఐ , ఎలక్షన్ కమిషన్ , ఎన్ఐఏ , తమకు అనుకూలంగా చేసుకొని ప్రతిపక్ష పార్టీల నాయకులు మేధావుల మీద అక్రమ కేసులను బనాయిస్తూ తీవ్ర భయాందోళనకు గురి చేయడం జరుగుతున్నది. మోడీ తన నియంతృత్వ చర్యలతో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడం జరుగుతోందన్నారు.

**పీడిత ప్రజల ఉద్యమాన్ని నిర్వీర్యం చేసిన మోడీ**

దేశంలో నక్సలిజం లేని ప్రాంతంగా చేస్తామని దండకారణ్యం ప్రాంతంలో ఆదివాసులకు అండగా నిలిచిన మావోయిస్టులను లక్షలాదిమంది మిలిటరీని ఉపయోగించి బూటకపు ఎన్కౌంటర్లు అనిచివేత లొంగుబాట్లు ద్వారా పీడిత ప్రజల ఉద్యమాన్ని నిర్వీర్యం చేసినామని మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకోవడం జరుగుతున్నది . కానీ నక్సలబరీ ఉద్యమం ప్రారంభమైన నాటి నుండి తీవ్రమైన నిర్బంధాలను అణిచివేతలను ఎదుర్కొంటూ వస్తున్నది. అయినప్పటికీ నక్సలబరి పోరాట స్ఫూర్తితో నేటికీ సామ్రాజ్యవాదం కార్పొరేట్ దోపిడీ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా ఒక బలమైన సవాలుగా నిలుస్తున్నది. ఈ స్ఫూర్తిని అణిచివేయకుండా తమ లక్ష్యాలు సాధించలేమని దోపిడీ పాలకవర్గం గుర్తించిందన్నారు. అందుకే విప్లవ ఉద్యమాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతోనే ఆపరేషన్ కగార్ వంటి నిర్బంధ చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టడం జరిగింది. పీడిత ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దోపిడీ లేని సమాజ నిర్మాణంలో ఉందని సోషలిస్ట్ వ్యవస్థ ద్వారానే సమ సమాజ స్థాపన




సాధ్యమవుతుందని విప్లవ ఉద్యమం విశ్వసిస్తున్నదన్నారు. ప్రజా ఉద్యమాలలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనడం ద్వారానే విప్లవోద్యమంలో అమరులైన వీరులకు మనం నిజమైన ఘన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ రెడ్డి , జిలాన్ రామాంజనేయులు ఆశాబి మాబూనీ , రాందాస్ దావీదు రాజేష్ , శివయ్య చంద్రమ్మ మహేష్, నరసప్ప, కదిరప్ప, అనిల్ పొన్నూరు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఉపసర్పంచ్ మధ్య వివాదం

## తీవ్ర స్థాయికి చేరిన విభేదాలు





**మల్లాపూర్ జులై 28 (రిపబ్లిక్ న్యూస్)**

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో గ్రామ పంచాయతీలో పాలకవర్గం చేసిన ఒక తీర్మానం వివాదానికి కేంద్ర బిందువైంది. ఇంతకీ ఆ ప్లెక్సీలో ఏముందంటే, " ప్లెక్సీలు, వాల్ రైటింగ్, వ్యాపార, వ్యక్తిగత, రాజకీయ ప్రకటనలు, పండుగల కొరకు ప్లెక్సీలు ఏర్పాటు చేసే వ్యక్తులు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుని నిర్ణీత చార్జీలు చెల్లించాలని అట్టి ప్లెక్సీలు, బోర్డులు మూడు రోజుల వరకు ఉచితమని ఆ తర్వాత చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తీర్మానం చేసారు. " ఇట్టి తీర్మానం నెల క్రితం చేసారు. ఇదే సమయంలో కొన్ని నెలల క్రితం ఉపసర్పంచ్ నందిని గ్రామంలో ఓ రెండు చోట్ల ప్లెక్సీలు ఏర్పాటు చేసారు. ఇట్టి ప్లెక్సీలకు నిర్ణీత ఫీజు చెల్లించాలని లేని పక్షంలో అట్టి ప్లెక్సీలను తొలగిస్తామని సర్పంచ్ చెప్పడంతో వివాదం చెలరేగింది. పంచాయతీ కార్యదర్శి సిబ్బందిని వెంటబెట్టుకుని ప్లెక్సీలను తొలగించాడనికి వెళ్లడంతో ఉపసర్పంచ్ వర్గీయులు అడ్డుకోవడంతో వివాదం చినికి చినికి గాలివానగా మారింది. కాగా ఉపసర్పంచ్ ఏర్పాటు చేసిన ప్లెక్సీ కి రేపటి లోగ అనుమతి తీసుకుని చార్జీలు చెల్లిస్తామని చెప్పడంతో కార్యదర్శి వెనుదిరిగి పోయారు. అయిన వెనక్కి తగ్గని సర్పంచ్ తన సిబ్బందిని తీసుకుని పోయి ప్లెక్సీ తీసేయడం కొసమెరుపు. అనేక గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య ఉండే ఆధిపత్య పోరు అభివృద్ధికి శాపంగా మారుతోంది. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో ఒకరు చేసే పనులకు మరొకరు సంతకం పెట్టకుండా అడ్డుపడటం సర్వసాధారణమైపోయిందని, ఇకనైనా సర్పంచ్ ఉపసర్పంచ్ లు బేషజాలకు పోకుండా ఇలాంటి గొడవలు వదిలేసి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా గొడవ పడిన సర్పంచ్, ఉపసర్పంచ్ లు ఒకే పార్టీకి చెందినవారు గమనార్హం.

## ఇటిక్యాల సాయిబాబా దేవాలయంలో అఖండ సాయి నామ సప్తహం, గురు పౌర్ణమి రోజు అన్న ప్రసాదం వితరణ




**రాయికల్ మండలం జూలై,28( రిపబ్లిక్ న్యూస్)**

అఖండ సాయి నామ సప్తాహం 23 జూలై నుండి 29 బుధవారం గురుపౌర్ణమి వరకు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల సాయిబాబా దేవాలయంలో అఖండ సాయి నామ సప్తహం నిర్వహిస్తున్నామని శ్రీమతి చెన్నా మనేని నివేదిత కృష్ణారావు తెలిపారు ప్రతి సంవత్సరము ఇదే సమయంలో సాయిబాబా దేవాలయం ఇటిక్యాలలో నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు భక్తులకు ప్రశాంత వాతావరణంలో దేవాలయంలో పూజలు చేసుకోవచ్చని అని అన్నారు గురువారం నుండి గురు పౌర్ణమి వరకు ఈ కార్యక్రమం ఉంటుందని 29 రోజున గురు పౌర్ణమి సందర్భంగా అన్నప్రసాదం కలదు భక్తులు పెద్ద మొత్తంలో వచ్చి స్వామి కృపను అందుకోగలరని ఆమె కోరారు సాయిబాబా ఆలయానికి మల్లాపూర్, ఖానాపూర్, రాయికల్,జగిత్యాల్,ప్రాంతాల నుండి పెద్ద మొత్తంలో భక్తులు వస్తారని నిర్వాహకులు తెలిపారని దుగ్యాల విద్యాసాగర్ రావు కొల్లూరు వేణులు తెలిపారు

## హైదరాబాదులో జరిగిన వార్డ్ కౌన్సిలర్ల జాతీయ పట్టణ నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కామ్ రవీందర్




**రాయికల్ మండలం జులై,28( రిపబ్లిక్ న్యూస్)**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఈఎస్సీఐలో నిర్వహించిన తెలంగాణ వార్డు కౌన్సిలర్ల జాతీయ పట్టణ నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కామ్ రవీందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోప్షన్లు పాల్గొన్నారు. పట్టణాభివృద్ధి, మున్సిపల్ పాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వార్డుల అభివృద్ధిలో కౌన్సిలర్ల పాత్రపై ఈ శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలోచేర్మెన్ కట్కామ్ రవీందర్ కౌన్సిలర్లు, కో అప్షన్ లు పల్లి కొండా గంగదర్, కల్లెడ దర్మపూరి,మహేష్ గౌడ్, ఇర్ఫాన్, పుర్రె శ్రీధర్, తురుగా శ్రీధర్రెడ్డి , వేముల రాము,ఎలిగేటి అనిల్, మచ్చ శేఖర్, రాకేష్ నాయక్, మురళి, బుమేష్, సురేష్ లు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మాజీమంత్రి జీవన్ రెడ్డి వాక్యాలు అర్థరహితమని

# బోర్నపల్లి జగన్నాథ్పూర్ బ్రిడ్జ్ నిర్మాణ కొరకు పూర్తి ప్రయత్నిస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





**రాయికల్ మండలం జులై,28 ( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల మోతే రోడ్డు పార్టీ కార్యాలయం లో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ విలేకరుల సమావేశం లో మాట్లాడూతు తాను మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ ని హైదరాబార్ లో కలిసి రాయికల్ మండలశీ బోర్నపల్లి జగన్నాథ్ పూర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో వినతిపత్రాన్ని అందజేయడం పట్ల జీవన్ రెడ్డి వాక్యాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. కేంద్ర మంత్రి జువెల్ ఓరం రాయికల్ మండలం లో జగన్నాథ్ పూర్ బ్రిడ్జి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ,వారిని ఎంపీ అరవింద్ తో ఢిల్లీలో కలిసి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది అని గుర్తు చేశారు. ఎస్టీ వెల్ఫేర్ శాఖ వారి వద్ద ఉండడంతో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరగా నా సూచన మేరకు కేంద్రానికి జగన్నాథ్ పూర్ బ్రిడ్జి ప్రతిపాదనలు పంపడం జరిగింది.మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ మంత్రి అయ్యాక బోర్నపల్లి జగన్నాధపూర్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేశారని,తొలి సంతకం చేశారని, టెండర్ వేసిన కాంట్రాక్టర్లు పని చేయకపోవడం వల్ల మరల టెండర్ ప్రక్రియ చేపట్టాలని ,కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ,త్వరిత గతిన పనులు పూర్తి కి కృషి చేయాలని వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందని అన్నారు.

రాయికల్ పట్టణంలో మాజీ మంత్రి సీనియర్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడడం ప్రజలకు ఆశ్చర్యంగా ఉంది.2012 సంవత్సరం లో సీనియర్ నాయకులు మాజీ మంత్రి బోర్నపల్లి బ్రిడ్జికి కోటి రూపాయలు మంజూరు అయ్యాయని, అధికారులతో వెళ్లి అక్కడ ప్రజలకుచెప్పారని గుర్తు చేశారు.కోటి రూపాయల నిధులు ఏమయ్యాయి అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.జీవన్ రెడ్డి మాటలకు ప్రజలు ఆశ్చర్య పోతున్నారు.ఎంపీ అరవింద్ జీవన్ రెడ్డి గతంలో కలిసి పని చేసినట్టుగానే ఇప్పుడు మళ్లీ కలిసి పని చేస్తున్నారా అని ప్రజల్లో ఆశ్చర్యం కలుగుతుంది అన్నారు.కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ పథకంలో భాగంగా రావాల్సిన నిధులను సీనియర్ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదు రాయికల్ ప్రెస్ మీట్ లో తెలిసిన కాంట్రాక్టర్ ను తీసుకువచ్చి పని చేయొచ్చు కదా అని అన్నారని గతంలో గణేష్ నవరాత్రుల సమయంలో జగిత్యాల పట్టణం లో నాకు తెలిసిన కాంట్రాక్టర్ పనులు చేస్తే అభివృద్ధి కి అడ్డం పడ్డారని, నేడు మళ్లీ తెలిసిన కాంట్రాక్టర్ తో పని చేయొచ్చు కదా అని అనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని అన్నారు.

సీనియర్ నాయకులు గతంలో రోడ్డు భవనాల శాఖ మంత్రిగా ఉండి బోర్నపల్లి జగన్నాథ్ పూర్ బ్రిడ్జి ఇటిక్యాల రామారావు పల్లి, రామాజీపేట,కోనా పూర్, మైతాపూర్ బ్రిడ్జిలు ఎందుకు పూర్తి చేయలేదు చెప్పాలని అన్నారు. గత 25 ఏళ్ల టిఆర్ఎస్ పార్టీని కేసీఆర్ ను వారి కుటుంబాన్ని అన్ని రకాలుగా విమర్శించి , నేడు రహస్య ఒప్పందంలో భాగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు.జీవన్ రెడ్డి మాటలకు ప్రజలు ఆశ్చర్య పోతున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ వాణి శ్రీనివాస్ ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి బండ శంకర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం గోలి శ్రీనివాస్ కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ రాయికల్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, నాయకులు కోల శ్రీనివాస్ పాదం రాజు సురేందర్ నాయక్ ప్రసాద్ మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్ భూమేష్ నక్కల రవీందర్ రెడ్డి రేపల్లె హరి కృష్ణ ,కుసరి అనిల్ ,

కౌన్సిలర్ క్యాదసు నవీన్ జిల్లా వీరబత్తినీ శ్రీనివాస్ సర్పంచుల ఫోరం బొలిశెట్టి గంగారెడ్డి అబ్బారి మల్లేశం గౌడ్ నలువల సురేష్ మహేశ్వర్ రావు విద్యాసాగర్ యూత్ నాయకులు సాయి దయల శరత్ గట్టు రాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వివరాలు (ఎస్ ఐ ఆర్ ) ఎనుమ రేషన్ ఫారం నింపి బియల్ ఓకు అందించిన మైతపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు..






**రాయికల్ మండలం**

**జులై,28( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని రాయికల్ మండల పరిధిలోని మహితాపూర్ గ్రామంలో ఈ రోజు ప్రత్యేక ఓట రు సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్ )ఎనుము రేషన్ ఫారం నింపి సంబంధిత బిఎల్ఓ కు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు అనుమల్ల రమ సత్యనారాయణ బుస గంగా మల్లయ్య తొగిటి నవీన్ బతిని శ్రీనివాస్ పరమేశ్వర్ లు కలిసి ఈ రోజు అందించడం జరిగింది. నేటి వరకు గ్రామంలో మూడు పోలింగ్ బూత్ స్థాయి లో 44 బూతు లో 901 ఓట ర్లు కు గాను 875 ఓటరు సర్ పరం నింపి అందించడం జరిగిందని ఇందులో తోబంది ఎడుశాతాం పూర్తయినది. 45 బూతులో 1277 ఓటరు గాను 1175 సార్ ఫారం నింపి అందించడం జరిగింది. ఇందులో తోంభది రేండు శాతం పూర్తయినది .అలాగే 46 వ పోలింగ్ బూత్ స్థాయి లో 716 ఓట ర్లు కు గాను 716. మంది ఓట ర్లు ఎనుమ రేషన్ పరం నింపి అందించడం జరిగిందన్నారు.. మొత్తం గ్రామంలో 2894 ఓట ర్లు కుగాను 2765 ఓట ర్లు తిరిగి సర్ పరంలు అందించడం జరిగిందని 46వ పోలింగ్ కేంద్రము బూతు లెవల్ అధికారి పద్మ లతా నూటికి నూరు శాతం సర్ పరం పూర్తిస్థాయిలో చేసినందున ఆమెను గ్రామస్థులు అభినందించారు

ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పౌరుడి కి ఓటు హక్కు కల్పించడం నకిలీ ఓటు మరియు మరణించిన వారి పేర్లను తొలగించి పారదర్శక మైన ఓటరు జాబితాను రూపొందించడం (సార్ ) ప్రధాన లక్ష్యం. భారతదేశంలో ఒక వ్యక్తి కి ఒకే ఓటు ఉండే విధంగా ఎన్నికల వ్యవస్థ ద్వారా బలోపేతం చేయడం చాలా మంచి నిర్ణయం తీసుకున్నారు అని అన్నారు. దీని ద్వారా అర్హులైన వారికి ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాడం డూప్లికేట్ అనర్హత గల ఓటు హక్కును తొలగించడం ఒక్కొక్కరికి డబుల్ ఓటరు గా నమోదయింది. ఇపుడు అలాంటి వారిని గుర్తించి ఒకే ఓటు హక్కు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు

ఈ కార్యక్రమంలో గ్రామ పరిపాలన అధికారి శ్రీనివాస్ అంగన్వాడీ కార్యకర్తలు బూతు లెవల్ అధికారులు మమత పద్మ లత శాంత గ్రామ నాయకులు మరియు అనుమల్ల సత్యనారాయణ లక్ష్మి నారాయణ. శ్రీనివాస్. కృష్ణ రెడ్డి భూమయ్య గంగాధర్. తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కామేశ్వరి దేవికి ఫలాలతో అలంకరణ

**మహానంది, జూలై 28, (రిపబ్లిక్ న్యూస్)**

మహానంది క్షేత్రంలో ఆషాడ మాసం పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవంలో భాగంగా మంగళవారం శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారికి వివిధ రకాల ఫలాలతో అలంకరణ చేశారు. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని మాట్లాడుతూ.. లోక కళ్యాణం కాంక్షిస్తూ శాకంబరీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడవ రోజు బుధవారం అన్ని రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ ఉంటుందన్నారు.



# రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బిజెపి- ముక్కా రూపేష్ రెడ్డి.




**రైల్వే కోడూరు జూలై 28 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలో కోడూరు పట్టణంలోని తేజ కళ్యాణమండపంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అసెంబ్లీ స్థాయి సంస్థాగత కార్యచరణ దిగ్విజయంగా నిర్వహించుకోవడం జరిగిందని ఓబులవారిపల్లి మండల బిజెపి అధ్యక్షుడుముక్కా రూపేష్ రెడ్డి అన్నారు,ఈ కార్యక్రమానికి బి ఎల్ ఏ - 1 గడ్డం చంగల్ రాజు సభాధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా ఇంఛార్జ్ పివి క్రిష్ణా రెడ్డి అన్నమయ్య జిల్లా పూర్వ అధ్యక్షులుసాయి లోకేష్,అన్నమయ్య జిల్లా ఇంఛార్జ్ మరియు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ టి డి వరప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కదిరి నరేష్ బీడీ బాలాజీ, మాజీ ప్రధాన కార్యదర్శి పెనుబాల చంద్రశేఖర్, మరియు ఐదు మండలాల అధ్యక్షులు సాయం శ్రీధర్, ముక్కా రూపేష్ రెడ్డి, కమలాపురం మనోహర్ రెడ్డి, బాపూజీ, మరియు కిసాన్ మోర్చా అన్నమయ్య జిల్లా ఇంఛార్జ్ తోట శ్రీనివాసులు మరియు మహిళా మోర్చా జిల్లా సెక్రటరీ శ్రీమతి కుప్పాల జ్యోతి, వివిధ మోర్చాల పదాధికారులు,252 పోలింగ్ బూత్ లెవెల్ అసిస్టెంట్ లు



ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతంగా నిర్వహించడం జరిగింది. రూపేష్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీని గ్రామ వార్డు స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ఈ సమావేశంలో చర్చించడం జరిగినదని దేశంలో ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న జి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలను ఎంతో ఆకర్షించేయని ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని సపోర్ట్ చేసే దిశగా ముందడుగు వేస్తున్నారని అందుకే వార్డు స్థాయి నుంచి నియోజకవర్గం అడుగడుగున వీధివీధిన బిజెపి నినాదాన్ని వినిపించి ముందుకు సాగుతామని రూపేష్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగినది

## వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

### నెలరోజులు గడివిచ్చిన సిపిఓ గోపీనాథ్.



**రైల్వే కోడూరు జూలై 28 రిపబ్లిక్ న్యూస్.**

ముగ్గురాయికి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మంగంపేట ముగ్గురాయి గనుల నుండి భారీ ట్రక్కుల ద్వారా ముగ్గురాయిని గనుల నుండి వెలికి తీసే క్రమంలో వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరని ఏపిఎండిసి, సిపిఓ గోపీనాథ్ అన్నారు, ఓబులవారిపల్లె మండలం మంగంపేట ఏపీఎండిసి చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోపీనాథ్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మంగంపేట ముగ్గరయి గనుల్లో ముగ్గరాయిని వెలికి తీయడానికి నిరంతరము సుమారు 3 వందల డిస్పాచ్ లారీలు పనిచేస్తుంటాయని వీటన్నింటికీ ఫిట్నెస్ సర్టిఫికెట్ ఉందో లేదో తెలుసుకోవడానికి మెకానికల్ ఇంజనీర్ చలపతి రెడ్డి తో కలిసి వాహనాల చెకింగ్ గత రెండు రోజుల క్రితం తనిఖీలు నిర్వహించడం జరిగినదన్నారు, ఈ సందర్భంగా ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని వాహనదారులకు హెచ్చరిక జారీచేయడం జరిగినది అన్నారు, నెల రోజుల్లో డ్రైవర్ మరియు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెలిడ్ గా ఉండాలని లేని పక్షంలో వాహనాన్ని గని లోనికి అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు త్వరలోనే డ్రైవర్ మరియు వాహనాలకు సంబంధించి లైసెన్స్, వాహనాలు, వాహన పత్రాలు అన్ని ఆన్లైన్ సిస్టంలోకి తీసుకురావడం జరుగుతుందని అటు తర్వాత ఫిట్నెస్ సర్టిఫికెట్ మరియు డ్రైవర్ లైసెన్స్ లేని ఏ వాహనము గేటు దాటి లోనికి రావడానికి వీలు కాదని అన్నారు, సరైన పత్రాలు లేని వాహనము ఆన్లైన్ సిస్టం వల్ల ఆటోమేటిక్గా గేటు దగ్గరే నో ఎంట్రీ ఆన్లైన్లో చూపిస్తుందని తద్వారా వాహనము అక్కడే ఆగిపోతుందన్నారు, ఈ ఆన్లైన్ సిస్టం వల్ల అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా రవాణా నిర్వహించడం జరుగుతుందని, ప్రమాదాలను కూడా నివారించవచ్చని సిపిఓ గోపీనాథ్ అన్నారు,

# పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై బుడగ జంగాల కాలనీలో పర్యటించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

**గర్భిణులు, చిన్నారుల కోసం వెంటనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశం**

**కాలనీవాసుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**పాఠశాల, రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటిక సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**







**నంద్యాల బ్యూరో, జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం నంద్యాల పట్టణంలోని బుడగ జంగాల కాలనీని సందర్శించి స్థానికుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కాలనీవాసులు తమ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రం సమర్పించగా, కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు నేరుగా కాలనీకి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంటనే ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించి, అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులందరినీ నమోదు చేసి ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్త్రీ శిశు సంక్షేమ అధికారిని ఆదేశించారు. అనంతరం కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రస్తుతం అద్దె భవనంలో 104 మంది విద్యార్థులతో పాఠశాల నిర్వహణ జరుగుతున్న పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులతో మాట్లాడి పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటికకు దారి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు భూమి కేటాయింపు తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్నేళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల వినతులపై స్పందించిన కలెక్టర్, సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన భూమి కేటాయింపు అంశంపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేసి అవసరమైన లెవలింగ్ పనులు చేపడతామని తెలిపారు. ఆక్రమణలు లేదా ఇతర అడ్డంకులు ఉన్నచోట వాటిని తొలగించి ప్రజలకు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈఓ జనార్ధన్ రెడ్డి, పీడీ ఐసీడీఎస్ పిడి లీలావతి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**: కలెక్టర్ జి. రాజకుమారి**

**అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురణ**

**ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం, పోలింగ్ కేంద్రాల పునర్విభజన, ఓటర్ల డిజిటైజేషన్, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి అన్నపురెడ్డి ప్రదీప్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి కె. శ్రీనివాసులు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి కసెట్టి చంద్రశేఖర్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి పి. నర్సింహులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి ఎ. నరేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తుది ఓటరు జాబితా ప్రచురణను సెప్టెంబర్ 22కు బదులుగా అక్టోబర్ 3న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,629 నుంచి 1,763కు పెరిగిందని, 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం విభజించి, ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజనలో వచ్చిన మార్పులకు భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లు ఉండగా, వారిలో 12,25,937 మంది వివరాలు విజయవంతంగా డిజిటైజ్ చేయబడ్డాయని, ఇది మొత్తం ఓటర్లలో 87.23 శాతమని కలెక్టర్ వివరించారు. మిగిలిన 1,79,506 మంది ఓటర్లలో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, ద్వంద్వ ఓట్లు ఉన్న వారు, ఇంట్లో అందుబాటులో లేని వారు తదితర కారణాలతో గుర్తించిన వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించినట్లు తెలిపారు. ఈ నెల 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జాబితాలు ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని, మరణించిన వారి పేర్ల తొలగింపును మరణ ధృవపత్రాలు, బీఎల్ఓల ధృవీకరణ ఆధారంగా మాత్రమే చేపడుతున్నామని చెప్పారు. గైర్హాజరైన వారు లేదా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిలో అర్హులైన నిజమైన ఓటర్లు ఎవరైనా ఉంటే అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణకు ముందే తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అవకాశం కల్పించబడిందని, అందిన దరఖాస్తులన్నింటినీ నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఓటర్లు కార్యాలయాలకు వ్యక్తిగతంగా రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారానూ ఫారమ్-6, 7, 8 తదితర దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4,099 ఆన్‌లైన్ దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, ఇతర ప్రాంతాల నుంచి నివాసం మార్చుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, కేవలం 6,066 మంది ఓటర్లు మాత్రమే మ్యాపింగ్‌కు మిగిలి ఉన్నారని, ఇది మొత్తం ఓటర్లలో కేవలం 0.43 శాతం మాత్రమేనని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్నవారికి, వివరాలు పూర్తి కానివారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య వయస్సు వ్యత్యాసాలు, జనన తేదీలలో తేడాలు వంటి అంశాలను సరిచేయడానికే ఈ ప్రక్రియ అని, నోటీసు అందిందని మాత్రమే ఓటు తొలగించబడుతుందనే అపోహలకు తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నంద్యాల అర్బన్‌లో అత్యధికంగా 46,741 వ్యత్యాసాలు నమోదయ్యాయని, అనంతరం డోన్, శ్రీశైలం, ఆళ్లగడ్డ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. ప్రతి కేసులోనూ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, సంబంధిత వ్యక్తుల వివరణలు స్వీకరించిన అనంతరమే నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణం, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారడం, ద్వంద్వ ఓట్లు వంటి అంశాలపై పూర్తి విచారణ అనంతరం పక్కా ఆధారాలతోనే స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటరు జాబితా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ప్రక్రియలో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వైసీపీ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం: మంత్రి టీజీ భరత్

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి కర్నూలులో ఇంటింటికీ ప్రచారం నిర్వహించిన మంత్రి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 28)**
రాష్ట్రాన్ని గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల నుంచి బయటకు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన సందర్భంగా కర్నూలు నగరంలోని 49వ వార్డు ఎన్.ఆర్.పేటలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక, పరిపాలనా ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం వాటిని అధిగమిస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతోందన్నారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఈ పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోందని మంత్రి పేర్కొన్నారు. అలాగే కర్నూలు జిల్లాకు పెద్దఎత్తున పరిశ్రమలను తీసుకువస్తున్నామని, యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తున్నాయని, రిలయన్స్ సంస్థకు సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం తప్ప వైఎస్సార్సీపీ నాయకులకు మరో పని లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షుడు కొరకంచి రవి, వార్డు ఇన్‌చార్జి కౌశిక్, బూత్ ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన డా. మాచాని సోమనాథ్



**ఎమ్మిగనూరు , జూలై 28:(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
కర్నూలు జిల్లా ఎస్పీ గౌ. శ్రీ విక్రాంత్ పాటిల్ (ఐపీఎస్) గారిని మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌ. డా. మాచాని సోమనాథ్ గారు మంగళవారం కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సామాజిక, ప్రజాహిత అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు. కార్యక్రమంలో మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు

# 31న జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే

**అనంతపురం సంక్షేమం, జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):**
అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 31న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు డిమాండ్స్ డే పాటించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులకు కార్మిక భీమా సదుపాయం, వర్కింగ్ జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు, జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీతోపాటు జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, సి ఆర్ మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో తదనుగుణంగా జిల్లాల్లో సమాచార శాఖను బలోపేతం చేసి జర్నలిస్టులకు అవసరమైన సదుపాయాల కల్పన, జర్నలిస్టుల స్థితిగతుల అధ్యయనం కోసం మీడియా కమిషన్ ఏర్పాటు, ప్రభుత్వ సారధ్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పునరుద్ధరణ, వృద్ధాప్యంలోని జర్నలిస్టులకు వృద్ధాశ్రమ నిర్మాణం తదితర సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో, జిల్లా కేంద్రాలలో జర్నలిస్టుల డిమాండ్స్ డే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా శాఖ పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని రాష్ట్రంలోని ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులందరూ కలిసి రావాలని కోరుతున్నాం.

# అర్హులందరికీ చేనేత భరోసా ఇవ్వాలి

**ఆర్డీవోకు ఆర్ఎస్పీ, బీఎస్పీ వినతి**



**శ్రీ సత్య సాయి/ధర్మవరం,**
**జూలై 28,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేనేత భరోసా పథకాన్ని అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి వెంటనే అమలు చేయాలని ఆర్ఎస్పీ, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో ఏవో కుప్రాకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఏడాది జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతి చేనేత కార్మికుడికి ఏటా రూ.25 వేల చేనేత భరోసా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని విమర్శించారు. హామీ అమలు కాకపోవడంతో ప్రతి చేనేత కుటుంబం రూ.50 వేల మేర నష్టపోయిందన్నారు.రానున్న ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నాటికి అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి రూ.75 వేల చెల్లించి ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అలాగే చేనేతకు సంబంధించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, ధర్మవరంలో చేనేత ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.వార్పు, జరీ, ముడి సరుకుల ధరలను తగ్గించడంతో పాటు మగ్గం నేసే కార్మికుల కూలి రేట్లను పెంచాలని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్పీ నాయకులు మంజుల నరేంద్ర, నరసింహులు, లోకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.ద

# 'వన్ మంత్ - ఫోర్ విజిట్' లో స్వీకరించిన అర్జీలను నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించండి

**ప్రజా అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేదు -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై 28 (రిపబ్లిక్ న్యూస్):**
వన్ మంత్ – ఫోర్ విజిట్' లో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా, ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాల్లో స్వీకరించిన ప్రజా అర్జీల పరిష్కార పురోగతిపై జిల్లాధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సమావేశంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 2,074 ప్రజా అర్జీలు స్వీకరించగా, వాటిలో 1,621 అర్జీలను పరిష్కరించారని, ఇంకా 453 అర్జీలు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. అదేవిధంగా, శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో గత మూడు వారాలుగా నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 929 ప్రజా అర్జీలు అందాయని తెలిపారు. వాటిలో 417 అర్జీలను పరిష్కరించగా, 512 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే సంబంధిత ప్రజా వినతులను తహసీల్దార్లు బాధ్యతాయుతంగా, నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా పరిష్కారం చూపాలని సూచించారు. ఇళ్ల స్థలాల కేటాయింపుకు సంబంధించి గత నెలలో జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు కోరుతున్న దరఖాస్తుదారులు ప్రభుత్వం నుంచి తదుపరి మార్గదర్శకాలు వెలువడే వరకు వేచి ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వెలుగోడు మండలంలో ఇళ్ల స్థలాలకు సంబంధించి 110 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులను అర్హత, అనర్హత ప్రమాణాలను ప్రజలకు స్పష్టంగా వివరించి అపోహలకు తావు లేకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్జీలను శాఖల వారీగా, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులు నాణ్యమైన పరిష్కారం అందించి పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com